చౌడేపల్లి మండలంలో విషజ్వరాలపై తనిఖీలు

డిఎంఅండ్‌హెచ్‌ఓ విస్తృత పర్యటన

విశాలాంధ్ర - తిరుపతి: చౌడేపల్లి మండలంలోని పుదీపట్ల పంచాయతీ చింతమాకుల పల్లి పంచాయతీ కొండయ్య గారి పల్లి పంచాయతీ లో విష జ్వరాలు వల్ల ఇబ్బందులు పడుతున్నారని బుధవారం డిఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి తనిఖీలు నిర్వహించారు. బిల్లేరు బైపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతూ శుభ్రత పరిశుభ్రత, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, గోరువెచ్చ నీటిని తాగాలని గ్రామస్తులకు తెలిపారు . అత్యవసర సేవలందించడానికి గ్రామాల్లోని ఏఎన్‌ఎం తో పాటు ఆశా వర్కర్లు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం వైద్య అధికారులకు తెలపాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. దుర్గ సముద్రం పంచాయతీ దాదేపల్లి గ్రామంలో 104 సేవలను తనిఖీ నిర్వహించారు. గర్భవతులకు చిన్న పిల్లలకు బీపీ షుగర్ లాంటి వాటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్ కుమార్, వైద్యాధికారి పూజ , మలేరియా ఆఫీసర్ శ్రీనివాసులు, హెల్త్ సూపరువైజర్లు రమణ, ఎంఎల్ హెచ్‌పి నాగలక్ష్మి, ఆశా వర్కర్లు, 104 పైలెట్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలం ముస్లిం పాలెం లో గత ఆదివారం విద్యుత్ షాక్ తో మృతిచెందిన హషీమ్ కుటుంబాన్ని బుధవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని . వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సాయం పదివేలు ఎమ్మెల్యే అందించారు.

తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ దూకుడు పెంచుతాం..

- తిరుపతిలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: ఏపి, తెలంగాణా రాష్ట్రాలలో బిజెపి బలోపేతం అయి దూకుడు పెంచుతామని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బుధవారం సాయంత్రం ఆయన తిరుపతికి విచ్చేసి మీడియాతో మాట్లాడారు. నరేంద్ర మోడీ పాలనపై ప్రజల్లో రోజురోజుకీ నమ్మకం పెరుగుతోందని చెప్పారు. 2014లో బిజెపికి 31శాతం ఓట్లు, 2019ఎన్నికల్లో 37.5శాతం 2024వ సంవత్సరంలో 38శాతం ఓట్లు రానున్నాయని ధీమా వ్యక్తంచేశారు. ప్రపంచ దేశాలు భారతదేశంలో జరుగుతున్న అభివృద్ధిని ఆసక్తిగా చూస్తున్నాయన్నారు. దాంతో వచ్చే ఎన్నికల్లోను బిజెపి విజయం ఖాయమని జోస్యం చెప్పారు. ఎపిలోను అత్యధిక స్థానాలను గెలిచి తీరుతామని చెప్పారు. కాంగ్రెస్ వేస్ట్ పార్టీ అని, సిలిండర్ ధరను 200 రూపాయలు తగ్గించడాన్ని మహిళలందరూ హర్షిస్తున్నారని నల్లారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నేతలు చంద్రగిరి పురుషోత్తం నాయుడు, గుండాల గోపీనాథ్ రెడ్డి, శాంతా రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే పేదల జీవితాల్లో వెలుగులు..

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు మహిళా విభాగం అధ్యక్షురాలు చక్రాల ఉష చెప్పారు. అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం శ్రీకాళహస్తి పట్టణం 12వ వార్డు పరిధిలో టీడీపీ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకు మునుపు రాఖీ పౌర్ణమి సందర్భంగా ముందస్తుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలందరూ రాఖీలను లోకేష్ అందివ్వాలని... యువగళం పూర్తి విజయవంతం కావాలని... చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ మిన్నల్ రవి, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష మాట్లాడుతూ... మహిళల కోసం 'మహాశక్తి' పేరుతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డనిధి కింద నెలకు రూ.1500 రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ 15వేలు అందిస్తారన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్టు లేని సౌకర్యం కల్పిస్తారన్నారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తెస్తారన్నారు. మహిళల భద్రత కావాలంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాలని , సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు సుమతి, ప్రధాన కార్యదర్శి దుర్గ, ఊహ, జయశ్రీ, రమాదేవి, స్వర్ణమ్మ, చంద్రకళ, సునీమా, రైతు విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, బషీర్, షాకీరాలీ, గురప్ప శెట్టి, జిలానీ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య, సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ నారాయణ, యాదగిరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరాజా యాదవ్, అధ్యక్షుడు అద్దంకి కిట్టు, వెంకటేష్ చౌదరి, సురేష్ నాయుడు, అస్మత్, భాస్కర్ గౌడ్, మోహన , ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సిలికా మైనింగ్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నేతల డిమాండ్

విశాలాంధ్ర-చిల్లకూరు: చిల్లకూరు మరియు కోట మండలాల్లో విస్తారంగా లభ్యమయ్యే నాణ్య మైన సిలికా ఖనిజ సంపదను, అక్రమార్కులు మైనింగ్ నిభంధనలను పాటించకుండా, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల లో దోచు కుంటు న్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ , బుధవారం తాహాశీల్దారు కార్యాలయం ముందు భారీ ధర్నా చేశారు. యంత్రాలను ఉపయోగించి భూమి లోపల 30 నుంచి 40 అడుగులు లోతుగా సిలికా ఖనిజం వెలికితీసి సొమ్ము చేసుకుంటున్నారని , పర్యావరణానికి తూట్లు పొడుస్తూ, తీరప్రాంత రైతులకు సాగునీరు అందించే సోనకాలువలో నీరు లేకుండా పోతుందనీ నిశితంగా విమర్శించారు. లారీల ద్వారా కేవలం 17 టన్నుల కు అనుమతులు పొంది 40 నుండి 50 టన్నుల ను రవాణా చేస్తుండటంతో, రహదారులు చిన్నాభిన్నం అయి ఛిద్రం అవుతున్నాయని పోలీసు అధికారులు, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములలోని సిలికా ఖనిజ సంపద దోపిడీ అరికట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్తలు పంట శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్రశేఖర్, నాయకులు వేమయ్య , తాజుద్దీన్ , నాగరాజు, శంకరయ్య, దయాకర్, రాజు , మూర్తి , అరవ పార్వతయ్య లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే మేమెందుకు రావాలి?

మండల సమావేశంలో పలువురు సభ్యుల ధ్వజం

విశాలాంధ్ర-గంగాధరనెల్లూరు : సమస్యలు పరిష్కారం కాకపోతే మండల సర్వసభ్య సమావేశానికి మేమెందుకు రావాలని పలువురు సర్పంచులు ధ్వజమెత్తారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పెద్దకాల సర్పంచ్ ఏకాంబరం మాట్లాడుతూజగనన్న లేఔట్స్ కోసం గుట్టను యంత్రాలతో చదును చేయమని తనను ప్రోత్సహించి పనులు పూర్తయ్యాక వాటి బిల్లులు చెల్లించక పోతే నా పరిస్థితి ఏం కావాలని డీఈ వెంకటేశ్వర్లను ప్రశ్నించారు.వెజ్జుపల్లె సర్పంచి హరి ప్రసాద్ మాట్లాడుతూ వారంలో ఆరు రోజులు మా గ్రామానికి ఆర్టిసి బస్సు వస్తోందని. ఆదివారం మాత్రం రావడం లేదని, దీనివల్ల మా గ్రామంలో ప్రజలు ఏం కావాలని ధ్వజమెత్తారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ బిందుమాలతి మాట్లాడుతూ అన్నిరకాల సౌకర్యాలతో అంగన్వాడి కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, సర్పంచులు ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లోని చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపించడానికి వారి వంతు సహకారం అందించాలని కోరారు. పాతపాళ్యం సర్పంచ్ క్రిష్ణమనాయుడు మాట్లాడుతూ మా పంచాయతీలో వేణుగోపాలపురం వద్ద సర్వే నెంబర్ 10లో దారికి సంబంధించిన భూమిని ఆక్రమించుకున్నారని వాటి విషయంగా తొలగించాలని తహసిల్దార్ ను కోరామని , రెవెన్యూ అధికారులు ఇంతవరకు ఆక్రమణకు గురైన దారి సమస్య పరిష్కరించలేదని వాపోయారు . తహశీల్దార్ ఇన్నవాథన్ మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలంలో భూపంపిణీ కింద రైతులను 235 మందిని గుర్తించామని వారికి 255 ఎకరాలు భూపంపిణీ లో అందించనున్నట్లు చెప్పారు. ఇంకా భూములను దున్నుతూ అనుభవిస్తున్న వారు భూ పంపిణీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు మాట్లాడుతూ పాడిఆవులకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే 1962 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపిన వాటిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని , ఆ అధికారులు నుండి సరైన సమాధానం రాలేదన్నారు . ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, ఎంఈఓ కాణిపాకం ఆంజనేయులు శెట్టి, తూగుండ్రం పిహెచ్సి డాక్టర్ ప్రశాంత్, ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాసులు హౌసింగ్, విద్యుత్ శాఖ ఏఈలు రాజా, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్ ఎక్స్అఫీషియో సభ్యులుగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళని

స్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్ధా వీర వెంకట సుధీర్ కుమార్ ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనా నంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని జేఈవో అందజేశారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు లోకనాథం, గోవింద రాజన్, హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఛైర్మన్

విశాలాంధ్ర - తిరుమల : శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి శ్రీవారి ఆలయం ఎదుట ఆవిష్క రించారు. అనంతరం ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబరు 18 నుండి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుండి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రప్రభుత్వం తరపున వేంకటేశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామన్నారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. రెండు బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపడు తున్నారని వివరించారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహి స్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి వాహన సేవలను దర్శించాలని ఈ సందర్భంగా ఛైర్మన్ కోరారు. ఈ కార్యక్ర మంలో జెఈవో వీరబ్రహ్మం, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, శ్రీకృష్ణ శేషాచల దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పరిష్కరించాలని కోరిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- నారాయణవనం : మండల కేంద్రంలోని నారాయణ వనం మండల పరిధిలోని పాలమంగళంలో కలెక్టర్ వెంకటరమణ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం ఓటు హక్కు సూచనలను గ్రామ ప్రజలకు వివరించారు. ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా బుధవారం నారాయణవనం మండలం పాలమంగళం గ్రామానికి విచ్చేసిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలిసి ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నాగలాపురం - చిన్న పాండూరు రోడ్డు దుస్థితి పై కలెక్టర్ కు వివరించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

పోలీసులకు రాఖీ కట్టిన బొజ్జల రిషితారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి రక్షాబంధన్ పురస్కరించుకుని ఊరందూరులో బుధవారం పోలీసులకు రాఖీ కట్టారు. ఈ సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... టీడీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడలో మైనింగ్ కార్యాలయం ముందు నిరసన తెలపడానికి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్ దోపిడీ గురించి విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నది ఆయన ఆలోచన. ఈ విషయం ముందుగానే పోలీసులకు తెలిసింది. దీంతో శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో వేకువ జామునే ఊరందూరుకు చేరుకున్నారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బయటకు వెళ్లకుండా పోలీసులను కాపలా ఉంచారు. ఎటువంటి పరిస్థితిలో విజయవాడకు వెళ్లకూడదంటూ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి సీఐ అజయ్ కుమార్ నోటీసులు ఇవ్వడానికి యత్నించాడు. అయితే ఈ నోటీసులను బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీసుకోలేదు. ఇంతలోపే టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఊరందూరుకు చేరుకున్నాయి. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని గృహ నిర్బంధం చేయడాన్ని టీడీపీ శ్రేణులు వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య వాదోప వాదాలు జరిగాయి. ఇదే సమయంలో తమకు బొజ్జల రిషితారెడ్డి రాఖీలతో అక్కడకు వచ్చారు. సోదర సమానులైన పోలీసులు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వారందరికీ రాఖీ కట్టారు. రక్షాబంధన్ పురస్కరించుకుని రాఖ కడుతున్నట్లు బొజ్జల రిషితారెడ్డి ఈ సందర్భంగా పోలీసులకు చెప్పారు. ఊరందూరుకు వెళ్లిన పోలీసులు అందరికీ ఆమె రాఖీ కట్టారు. ఒకరిద్దరు పోలీసులు మొహమాట పడినా వారిని ఒప్పించి రిషితా రెడ్డి రాఖీ చేతికి ఇచ్చారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని గృహ నిర్బంధం చేమయడానికి వెళ్లిన పోలీసులకు ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి రాఖీ కట్టిన సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది.

ఫ్రేమ్ 2.0 విధానానికి నిరసనగా పెన్ డౌన్

విశాలాంధ్ర-నాయుడుపేట : రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్రేమ్ 2.0 విధానానికి నిరసనగా ఈనెల 30,31వ తేదీల్లో పెన్ డౌన్ నాయుడుపేట దస్తావేజు లేఖర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్టాంపు వెండర్లు నిర్వహించదలచిన విషయం తెలిసిందే. ఈ నిరసన బుధవారం కూడా కొనసాగింది. దీంతో మంగళ, బుధవారాలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు మందుకొండిగా కొన సాగాయి.

ముత్యాలమ్మ దేవస్థానంలో చండీయాగం

విశాలాంధ్ర-చిల్లకూరు : ముత్యాలమ్మ దేవస్థానంలో బుధవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా చండీయాగం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ముత్యాలమ్మ అమ్మవారి మూలమూర్తికి అభిషేకం పూజలను ఆలయ పూజారులు భక్తి శ్రద్ధలతో చేసారు. అదిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు, చండీయాగం లో పాల్గొన్నారు. ఆలయ దర్మకర్తల మండలి ఛైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కొమ్మలపూడి నవీన్ కుమార్ లు ఆలయ సిబ్బంది సహకారంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

మల్లె సాగును లాభసాటిగా మార్చుకోండి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ఉదయం ఈ కార్యక్రమంలో మల్లెపూల సాగును కొన్ని మెలకువలను పాటిస్తూ లాభసాటిగా మలుచుకోవడానికి రైతులు ముందుకు రావాలని స్పిక్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తిరుమలరావు పేర్కొన్నారు. బుధవారం కొండలచెరువు గ్రామపంచాయతీలో గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ స్పిక్ కంపెనీ మల్లెపూల సాగుకు అనువుగా ఉన్నటువంటి కొన్ని ఉత్పత్తులను రైతులకు వివరించారు. మల్లెపూల సంబంధించి కొన్ని ఉత్పత్తులను ప్రదర్శనగా ఏర్పాటు చేసి రైతులకు వాటి పనితీరును వివరించారు. మల్లెపూల సాగుకు సంబంధించి ఎరువులను ఎలా వాడాలో కూడా వారు వివరిస్తూ రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్పిక్ జూనియర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ముబారక్, సాయి కృష్ణ రైతులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరంతిరుపతి నగరంలో సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే ఆడిటోరియం, వినాయక సాగర్ ప్రారంభోత్సవాలకు అన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఉద్దేశించి తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అన్ని విభాగాల అధిపతులతో జరిగిన సమావేశంలో కమిషనర్ హరిత మాట్లాడుతూ వినాయక సాగర్లోని పనులన్నింటిని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులు, ప్రజలు విచ్చేస్తారని తెలుపుతూ స్టేజి డెకరేషన్ కార్యక్రమాన్ని చక్కగా చేపట్టాలన్నారు. ఆర్ట్స్ డిస్టిక్ స్టూడియోలో ప్రారంభిస్తున్న ఆడిటోరియం ప్రారంభోత్సవానికి అన్ని చర్యలు తీసుకొని సిద్ధం చేయించాలన్నారు. ఈనెల 18న ముఖ్యమంత్రి చేతుల మీదగా ప్రారంభించబోయే శ్రీనివాస సేతు పూర్తయిన పూర్తి దశ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించేలా అన్ని ఏర్పాటు చేయాలని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, స్మార్ట్ సిటీ జి.ఎం చంద్రమౌళి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈలు విజయ్ కుమార్ రెడ్డి, దేవిక, మోహన్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, ఫైర్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోహన్ నాయుడు మృతికి హర్షిత్ రెడ్డి నివాళులు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం ఎం.కొంగర వారిపల్లికి చెందిన చలిచీమల మోహన్ నాయుడు మృతి చెందారు. ప్రభుత్వ టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్ట ర్ కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఆకస్మికంగా మృతి చెందారు. ఆ విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి బుధవారం ఆ గ్రామానికి చేరుకుని మోహన్ నాయుడు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని భార్య నాగమణి, కుమారుడు కరుణశ్రీ, కుమార్తె వేదవతి లను ఓదార్చి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గృహ నిర్బంధం

ఊరందూరులో ఉద్రిక్తత

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని బుధవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పాటు ఉద్రిక్తత నెలకొంది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... జగన్ ప్రభుత్వం చేస్తున్న మైనింగ్ దోపిడీకి వ్యతిరేకంగా విజయవాడ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపాలని టీడీపీ అధిష్టానం నిర్ణయించింది. అధిష్టానం పిలుపు మేరకు శ్రీకాళహస్తి నుంచి విజయవాడ వెళ్లాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో శ్రీకాళహస్తి గ్రామీ సీఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో వేకువ జామున 3గంటలకే ఊరందూరుకు వెళ్లారు. అక్కడ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బయటకు వెళ్లకుండా పోలీసులను కాపలా ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఊరందూరుకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా పోలీసుల కళ్లు గప్పి ఎలాగైనా విజయవాడకు వెళ్లాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పథకం రచించారు. తాను నియోజకవర్గం వదలి వెళ్లనని పోలీసులకు చెప్పారు. అయినా పోలీసులు అతని మాటలు నమ్మలేదు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి టీడీపీ శ్రేణులతో కలసి ఊరందూరు వీధుల వెంట నడుచుకుంటూ వచ్చారు. అప్పటికే ఊరి బయట సిద్ధంగా ఉంచుకున్న వాహనం ఎక్కి రేణిగుంట విమానాశ్రయం బయలుదేరారు. ఇది పోలీసులు అతనిని అనుసరించారు. అయితే టీడీపీ శ్రేణులు, ఊరందూరు వాసులు పోలీసు వాహనాలకు అడ్డుగా పడుకున్నారు. ఇదే అదనుగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వాహనాలు మారుతూ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఊరందూరులో పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ శ్రేణులు, స్థానికులను అతికష్టం మీద పక్కకు తోయడానికి పోలీసులకు చాలా సమయమే పట్టింది. ఇంతలోపు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి విమానాశ్రయం చేరుకున్న ఫలితం దక్కలేదు. అప్పటికే ఆయన వెళ్లాల్సిన విమానం విజయవాడకు బయలుదేరింది. దీంతో పోలీసులు మళ్లీ రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఊరందూరుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడకు వెళ్లాలనుకుంటే పోలీసులు తనను నిర్బంధించడం బాధాకరమన్నారు. వైసీపీ పాలనలో ప్రతిపక్ష పార్టీ నేతలకు భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. తాను విజయవాడ మైనింగ్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే శ్రీకాళహస్తి ప్రాంతంలో జరిగే దోపిడీ గుట్టు రట్టు అవుతుందనే భయంతోనే పోలీసులు తనను గృహ నిర్బంధం చేశారని ఆయన చెప్పారు. తనను అడ్డుకున్నట్లు ఇసుక అక్రమ రవాణాను పోలీసులు ఎందుకు అడ్డుకోలేక పోతున్నారని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో జరిగే ఇసుక అక్రమ రవాణాపై ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న లబ్ధిదారులు
- గడప గడపకు మన ప్రభుత్వం లో డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర - కార్వేటినగరం: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం అమ్మపల్లి, కేపీ అగ్రహారం పంచాయతీలోని అమ్మపల్లి, ఏఎంఆర్ కండ్రిగ, కృష్ణాపురం, పొన్నగల్లు, రాచపాళ్యం, కేపీ అగ్రహారం బీసీ కాలనీ, జాండ్ల పేట, జాండ్లపేట ఎస్టీ కాలనీ, సూరయ్యపాళ్యం ఎస్సీ కాలనీలలో సర్పంచ్లు భారతి,శేఖర్రెడ్డి, ఎంపీటీసీ రాధికారెడ్డి, ఎంపీపీ లతబాలాజీ , రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం ఇంటింటి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమాలు అందిస్తోందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ లక్ష నుంచి 6 లక్షల వరకు లబ్ధి చేరుకూరున్నాయని తెలిపారు. పేదల పాలిట కల్పవృక్షంగా నిలుస్తున్న వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. రావణాసుర లక్షణాలు కలిగిన చంద్రబాబు అధికారం కోసం తహ తహ లాడుతున్నాడని అలాంటి రాక్షసుడికి ఓట్లు వేస్తే రాష్ట్రం 30 సంవత్సరాల అభివృద్ధిలో వెనుక్కి వెళ్లి పోతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసమే సీఎం జగన్మోహన్రెడ్డి గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ అధికారులను చేరువ చేశారన్నారు. పుట్టబోయే శిశువు నుంచి మృతి చెందే వృద్ధుడి వరకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమాలకు లబ్దిదారులు మంత్రులు, ఎమ్మెల్యేలను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, మంగళహారతులు పడుతున్నారని తెలిపారు. పేదల ఆశీర్వాదాలే మాకు శ్రీరామ రక్ష అన్నారు. అదే విధంగా ఏపీ సీఎస్ సంఘం అధ్యక్షుడు కుమార్రెడ్డి కృష్ణాపురం జలాశయంలో చేపపిల్లలు కావాలని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన మంత్రి పిషరీస్ అధికారులతో మాట్లాడి స్పెషల్ స్కీం కింద మూడు వేల చేపల పిల్లలను ఇవ్వాలను ఆదేశించారు. అదే విదంగా పొన్నగల్లు, కృష్ణాపురం దళితవాడ, కేపీ అగ్రహారం బీసీ కాలనీ, జాండ్ల పేట దళితవాడల్లో విద్యుత్ లైన్లు ఇళ్లపై వెళ్లుతున్నాయని తొలగించాలని మహిళలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. అలాగే సూరయ్యపాళ్యం ఎస్టీకాలనీలో ఇంటి పట్టాలు మంజురు చేయాలని కోరడం వెంటనే ఇంటి పట్టాలు అందించాలని హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడును ఆశించారు. -నేను జగనన్నతోనే ఉంటా నేను నా జీవితం ఉన్నంత వరకు సీఎం జగనన్న, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితోనే ఉంటానని అన్నూరు సర్పంచ్ సుందర్ రాజ్ ఉప ముఖ్యమంత్రిపై ఒట్టేసి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 నుంచి సమితీ అధ్యక్షుడిగా నారాయణస్వామి అందించిన సేవలను గుర్తించికుని, ఆయన వెంటే ఉంటానని, మా అన్నకు టీడీపీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చినా నా పయనం జగనన్నతోనేనని, పసుపు కండువ వేసుకున్న, మృతి చెందినప్పుడు పసుపు మాల వేసుకున్నా ఒక్కటేనని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో అన్నూరు బూతులో ఏజెంటుగా ఉండి మంత్రి నారాయణస్వామిని 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ శేఖర్రాజు. మండల కోఆప్షన్మెంబర్ ప్రభాకర్రెడ్డి, ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఎంపీటీసీ దేశమ్మ, సర్పంచ్ పవన్, వైఎస్సార్సీపీ నాయకులు ధనశేఖర్వర్మ. చిన్నబ్బమండడి, కుమార్ రెడ్డి, మునేంద్రరెడ్డి, "మోహన్, వెంకటరత్నం, ఏకాంబరం,ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, చందురాజు, లోకనాథరెడ్డి, శేషాద్రి, ఎంపీడీఐ మోహనమురలి,డీటీ లక్ష్మీపతి, ఎంఈవో విజయకుమార్, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ సాగర్ బాబు వీరికి దక్షిణ గోపురం వద్ద సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న వినాయకసాగర్ ప్రారంభం

- టీటీడీ చైర్మెన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన

విశాలాంధ్ర - తిరుపతి నగరం : తిరుపతి కార్పొరేషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి స్మార్ట్ సిటీ నిధుల్లో భాగంగా నిర్మించిన వినాయక సాగర్ ప్రాజెక్టును సెప్టెంబర్ 7వ తేది ప్రారంభిస్తున్నట్లు టీటీడీ చైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. వినాయక సాగర్లో జరుగుతున్న పనులను బుధవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా లింగాలమ్మ చెరువుగా ప్రసిద్ధి చెంది, 59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును వినాయక సాగర్ గా నామకరణం చేసుకుని ప్రజల సౌకర్యార్థం, మంచి ఉద్యాన వనంగా ఏర్పాటు చేశారు. 20 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టును నిర్మించడం జరుగుతున్నది, ఇందులో వినాయక నిమజ్జనం కోసమని ప్రత్యేకంగా నిర్మించిన స్థలంలో పూర్తిగా శుద్ధి చేసినటువంటి మంచినీళ్లతో నింపి వినాయక నిమజ్జనానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గతంలో ఈ లింగాలమ్మ చెరువు అత్యంత దుర్గంధంగా తిరుపతిలోని డ్రైనేజీ వాటర్ తో నిండి ఉండేదని గుర్తు చేస్తూ, ఇప్పుడు అలా కాకుండా 5 ఎమ్.ఎల్.డి మురుగునీటి శుద్ధి ప్లాంట్ తో మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేశారని, శుద్ధి చేసిన నీటిని మొత్తం చెరువులో నింపే కార్యక్రమం చేస్తున్నట్లు ఆయన వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ చాలా చక్కటి సదుపాయాలను ఆనందకరంగా ఉండే రీతిలో, ఒక మంచి కళారీతులను కూడా ఇక్కడ తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నదని, సెప్టెంబర్ 7న వినాయక సాగర్ ప్రారంభిస్తున్నట్లు టీటీడీ చైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. వినాయక సాగర్లో అంచెలంచెలుగా చేపట్టబోవుతున్న ఏర్పాట్ల గురించి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ ఆయన

వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బోకం అనీల్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ విజయకుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ, వైసిపి నాయకులు పాముల రమేష్ రెడ్డి, లైఫ్లీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ

- పది రోజుల పాటు ఓటర్ల జాబితా వెరిఫికేషన్: జేసీ

విశాలాంధ్ర -చిత్తూరు: ఓటర్ల నమోదు మార్పులు చేర్పులకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ లో ఎటువంటి అపోహలు అవసరం లేదని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ కార్యాలయం లోని సమావేశపు మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ ఎన్ రాజశేఖర్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు ప్రక్రియ అత్యంతపారదర్శకంగా జరుగుతోందని ఏ స్థాయిలో అభ్యంతరాలు ఉన్నా తిరిగి విచారణ చేస్తామన్నారు. ప్రస్తుతం ఓటర్ల నమోదుకు సంబంధించి రీ-వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోందని, ఏ స్థాయిలో అనుమానాలు ఉన్నా వ్యక్తం చేయవచ్చు నన్నారు. ఫైనల్ నోటిఫికేషన్ జనవరి 6న విడుదల చేస్తామని ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు జేసీ తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ 2018 కన్నా ముందు ఉన్న ఈవీఎం లను వెనక్కు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నుంచి నాగరాజన్, కాంగ్రెస్ నుంచి పరదేశి, బిజెపి నుంచి చిట్టిబాబు, వైసీపీ నుంచి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు వైసీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్

విశాలాంధ్ర - పుంగనూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు వైసీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లో వైసీపీకి చెందిన అర్బన్ మండల సచివాలయ కన్వీనర్లుతో నియోజవర్గ పరిశీలకులు జింక చలపతి మంత్రి వ్యక్తిగత కార్యదర్శి చంద్రహాస్ అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ హలీం బాష పార్టీ గెలుపు కోసం బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలో లక్షల మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నప్పటికీ కొంత మందికే గృహ సారధులుగా సచివాలయ కన్వీనర్లుగా పార్టీ అవకాశాలు కల్పించిందని తెలిపారు. 'అంత మందిలో మీకు అవకాశం రావడం ఎంతో గొప్ప విషయమని, మీరందరూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అన్నిటిని గ్రామాల్లో వార్డులలో ఇంటింటా ప్రజలకు నేరుగా వివరించి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో, వార్డులలో ప్రజా సమస్యలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెలిపి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలతో ఇప్పటి నుండే మమేకమవుతూ 2024 ఎన్నికలు టార్గెట్‌గా గెలుపే లక్ష్యంగా సైనికుల పని చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు కన్వీనర్లకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ వారిని అప్రమత్తం చేసి రాబోయే 2024 ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి పెద్ద రెడ్డి రామచంద్రారెడ్డి లక్ష మెజార్టీతో గెలిచేలా అదే రీతిలో రాజంపేట పార్లమెంట్ సభ్యులుగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని మంచి మెజార్టీతో గెలిచే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన మండల కన్వీనర్ చెంగారెడ్డిని, పట్టణ కన్వీనర్ వరద రెడ్డిని వ్యక్తిగతంగా అభినందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు అమరనాథ్ రెడ్డి, నాగరాజు రెడ్డి, ఆవుల అమరేంద్ర, పార్టీ కౌన్సిలర్లు , సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర-పలమనేరు : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 80 శాతం సబ్సిడీపై ఉలవలను పలమనేరు నియోజక వర్గ ఎమ్మెల్యే డాక్టర్ వెంకటే గౌడ చేతుల మీదగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు మండలానికి 130 కింటాల విత్తనాలు వచ్చాయన్నారు. ఉలవలు సబ్సిడీ వాటి వివరాలు1 కిలో ఉలవలు ధర 108 సబ్సిడీ కిలో 86.40 రైతు వాటా ధర 21.60 రైతు తమ పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రంలో తెలిపిన తేదీలలో ఉలవలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది బయోమెట్రిక్ విధానం ద్వారా అర్హులైన రైతులందరికీ ఉలవలు అందజేయాలన్నారు. ఉలవలు 80 శాతం సబ్సిడీ10,800 రూపాయలు, సబ్సిడీ 8,640 రూపాయలు రైతు వాటా 2160 రూపాయలు, మొత్తం విత్తనాలు వచ్చింది 130 కింటలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ అన్నపూర్ణాదేవి, ఏవో సంధ్య, వైసీపీ నాయకులు వైసీపీ రూరల్ కన్వీనర్ బాలాజీ నాయుడు, రంగనాథం, చెంగారెడ్డి, గోవిందస్వామి, విజయ్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్, రమేష్ బాబు, రఫీ, తిరుమలేశు, గోవిందరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శికి రాఖీ పండుగ శుభాకాంక్షలు

విశాలాంధ్ర -పలమనేరు : రైల్వే కోడూరు చిన్న పాడు గ్రామంలో నివాసముంటున్న గల్ఫ్ దేశాలకు అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న సుబ్బరాయుడు ఆహ్వానం మేరకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ కు రాఖీ పండుగ సందర్భంగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రైల్వే కోడూరు చిన్న పాడు గ్రామంలో త్వరలో నూతన ఫ్యాక్టరీని స్థాపించిన ఉన్నట్లు గల్ఫ్ దేశ సంఘ అధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. అనంతరం గల్ఫ్ దేశాలలో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా మృతి చెందితే అలాంటి వారికి ఆయన సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అనంతరం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ ను ఆహ్వానించి పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గల్లా వేణుగోపాల్ నాయుడు, బాబు, కిషోర్, సోమశేఖర్ నాయుడు, జైపాల్ నాయుడు, శ్రీనివాసులు ల తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

గాండ్ల కులస్తులు నూతన జంధ్యధారణ

విశాలాంధ్ర-పలమనేరు: ప్రసిద్ధి శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాదీ కొనసాగుతున్న కుల సంప్రదాయాన్ని పాటించడంలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు పలమనేరు పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం (ఈశ్వరుని గుడి)లో నూతన జంధ్య దాంణ కార్యక్రమం గాండ్ల కులస్థులు మాజీ ఎంపీపీ ఆర్. రాజేంద్రన్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఇందులో పట్టణ పరిసర ప్రాంతాల గాండ్ల కులస్థులు పాల్గొని గాండ్ల కులస్థుల ఐక్యత చాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గాండ్ల సంఘం ప్రధాన కార్యదర్శి టీ.కే షణ్ముగం మునిసిపల్ కౌన్సిలర్ కోదండరామయ్య, పట్టణ గాండ్ల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు కేశవులు, బాబు, సుబ్రహ్మణ్యం శెట్టి కార్యక్రమం నిర్వహించగా పండితులు కిషోర్ స్వామి నేతృత్వంలో శాస్త్ర ప్రకారం జరిపారు. అనంతరం శివునికి పూజలు జరిపి ప్రసాద పంపిణీ చేశారు.

బస్సులులేక భక్తులకు ఇబ్బందులు

విశాలాంధ్ర - గుడిపాల : మండలం నుంచి వందల సంఖ్యలో తిరువన్నామలై గిరి ప్రదక్షణకు ప్రతి పౌర్ణమికి భక్తులు చేరుకుంటారు. తగినన్ని బస్సుల సౌకర్యం లేక భక్తులు సొంత వాహనాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పౌర్ణమి రోజు ఆర్టీసీ బస్సులను అదనంగా నడపాలని భక్తులు కోరుకుంటున్నారు.

జనసేన బిజెపి ఆధ్వర్యంలో వినూత్న ధర్నా

విశాలాంధ్ర- కార్వేటినగరం : కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని వినూత్న రీతిలో బుధవారం జనసేన, బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఇన్‌చార్జ్ పొన్న యుగంధర్ మాట్లాడుతూ కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని జనసేన ఆఫీస్ వద్ద, గాండ్లమిట్ట కూడలి వద్ద నిరసనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి సత్తా సామర్థ్యాలు ఉంటే కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. తుడ పరిధిలో ఉన్న కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో ఎందుకు కలపడం లేదు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్వేటినగరం మండల ప్రజలకు మీరు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శోభన్ బాబు,బీజేపీ మండల అధ్యక్షులు రామిశెట్టి రాజశేఖర్, బిజెపి స్టేట్ కౌన్సిల్ నెంబర్ నటింపల్లి యువరాజ్, పాలసముద్రం మండలం అధ్యక్షులు లతీష్, నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు భాను చంద్ర రెడ్డి,జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ,మండల కార్యదర్శి మీనా, ప్రతాప్, బిజెపి నాయకులు కుమార్, మధు, పలువురు పాల్గొన్నారు.

గజరాజు ఆగ్రహానికి ఇద్దరు బలి

విశాలాంధ్ర - గుడిపాల : ఏనుగు ఆగ్రహానికి ఇద్దరు వ్యక్తులు బలయ్యారు. ఈ సంఘటన మండలంలోని కట్టకింద పల్లి గ్రామం టాసా జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని 190 రామాపురం ఎస్సీ కాలనీకి చెందిన వ్యవసాయ రైతు దంపతులు వెంకటేష్, సెల్వి ఉదయం 7 గంటల ప్రాంతంలో తమ పొలాల వద్ద పనిచేసుకుంటున్న సమయంలో గజరాజు దాడి చేసింది. ఈ దాడిలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు వారి బంధువుల ఆర్తనాదాలతో రోడ్డుపై బైఠాయించగా, సంఘటన స్థలానికి చేరుకున్న ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి తమ సొంత నిధుల నుంచి 2 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయలు మృతుల కుటుంబాలకి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీనితో మృతుల బంధువులు రోడ్డుపై నుంచి వెళ్లిపోయారు. ఒంటరి ఏనుగుని సాయంత్రం 5 గంటల వరకు అయినా అటవీ శాఖ అధికారులు బంధించలేదు. ఈ విషయమై పై అధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

హెల్త్ సెంటర్‌ని ప్రారంభించిన ఎంపీపీ

విశాలాంధ్ర- ఐరాల: పూతలపట్టు మండలం వేపనపల్లిలో ప్రభుత్వ హెల్త్ సెంటర్ ని ఎంపీపీ కుమారి. వైస్ ఎంపీపీ ద్వారక నాథరెడ్డి లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ హెల్త్ సెంటర్ లో జరిగే వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వసంతమ్మ, ఎమ్మెస్ మనీ, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ సంగం అధ్యక్షులు దయ సాగర్ రెడ్డి. వైసిపి నాయకురాలు గౌహతి సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి యోగేంద్ర, నాయకులు వెంగనపల్లె చిట్టి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, గణపతి రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

విశాలాంధ్ర - సోమల: సోమల మండలం లో ని చిన్న సోమల గ్రామానికి చెందిన రాజన్న మేపుతున్న పాడి ఆవు ఒకే ఈతలో రెండు ఆడ దూడలు కు జన్మనిచ్చిందని రైతు తెలిపారు. తల్లి ఆవు, దూడలు ఆరోగ్యం గా ఉన్నాయని ఆయన తెలిపారు.

వీఆర్‌ఏల నిరసన

విశాలాంధ్ర -చిత్తూరు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన చేపట్టి అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ అర్హతలు ఉన్న వీఆర్‌ఏలకు ప్రమోషన్ కల్పించాలని, నామిని వీఆర్‌ఏలను ప్రభుత్వపరంగా వీఆర్‌ఏలుగా గుర్తించాలని, పిఆర్‌సి అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సమావేశం



విశాలాంధ్ర - పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం, ఎస్ఆర్ఆర్ కండ్రిగ, బలిజకండ్రిగ, కేజేపురం పంచాయతీల్లో సెప్టెంబర్ 2వ తేది శనివారం జరగబోయే టీడీపీ ఇంటింటికీ మీ ధామస్, భవిష్యత్తు ష్యూరిటీ, బాబు గ్యారింటీ కార్యక్రమ విజయవంతం చేయడానికి నాలుగు పంచాయతీ తెదేపా సీనియర్ నాయకులు , పార్టీ ముఖ్య నేతలలో సమావేశం నిర్వహిస్తున్న తెలిపారు. టీడీపీ ప్రభావశీల గుర్తింపు కార్యక్రమ కమిటీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు . ఈ నాలుగు పంచాయతీ పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామికి శ్రావణ మాస పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రావణమాస పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆల యంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కాశీ విశ్వేశ్వర స్వామికి, విశాలాక్షి అమ్మవారికి మహాగణపతికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ మంత్రపుష్పము అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాస పౌర్ణమి రోజున విశేషంగా స్వామి అమ్మవార్లకు సత్యనారాయణ వ్రతం నిర్వహించి స్వామివారిని పురవీధులలో ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు మహా భారత ఉత్సవాలకు ధ్వజారోహణం

విశాలాంధ్ర -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలం ఎన్ ఆర్ కమ్మపల్లిలో గురువారం వేకువజామున 2.30 గంటలకు ఆలయ అర్చకులు హరి ఆచార్ల చేధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు ఆలయ ధర్మకర్త యన్. రమేష్ బాబు తెలిపారు. మహాభారత ఉత్సవాలు సెప్టెంబర్ 10వ తేదీ ఆదివారం వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్న ట్టు చెప్పారు. ప్రతిరోజు మధ్యాహ్నం తిరుపతికి చెందిన జి.ఎస్.కె సీతా లక్ష్మి భగవాతారిణిచే హరికథ ఆలపించబడునని, రాత్రి మేనేజర్ పి మంజుల శ్రీనివాస్ డాన్సర్ నాగరాజు లా శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి వారిచే పౌరాణిక నాటకాలు ప్రదర్శించబడినట్లు వివరించారు. ప్రతిరోజు ఉభయ దాతలచే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఈ మహాభారత ఉత్సవాలకు నిలువు రాళ్ల కమ్మపల్లి, తిమ్మరాజుపల్లి, పులమనాయుడు కండ్రిగ, ఆముదాలపల్లి ,గొల్లపల్లి, రెడ్డివారిపల్లి ,సూరావారిపల్లి ,చిట్టత్తూరు ,కాలేపల్లి, నెత్తకుప్పం ,చంద్రప్ప నాయుడు కండ్రిగ, పిల్లారి కోన ,పాత వేపకుప్పం, మిట్టవేప కుప్పం, కొత్త వేప కుప్పం ,లక్ష్మీనరసింహపురం ,జయరాం నగర్, వేణుగోపాలపురం, పార్వతీపురం, లక్ష్మీపురం గ్రామాల వారు కార్యనిర్వాహకులుగా ఉంటారని తెలిపారు.

నగదు రహిత లావాదేవీలతో పన్నుల చెల్లింపులు సులభతరం

విశాలాంధ్ర- పులిచెర్ల కల్లూరు: నగదు రహిత లావాదేవీలతో పన్నుల చెల్లింపులు సులభతరమని సర్పంచ్. ఎస్.ఏ షుకూర్ అన్నారు. గ్రామ పంచాయతీలో వివిధ రకాల పన్నుల చెల్లింపులు నగదు రహిత కార్యక్రమాన్ని మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో ప్రజలు ప్రతి ఏటా చెల్లించే ఇంటి పన్ను ,నీటి పన్ను, లైసెన్స్ ఫీజులు భవన నిర్మాణ రుసుములు ఇకపై నగదు రహిత ద్వారా చెల్లించ వచ్చని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి అహ్మద్, పంచాయతీ కార్యదర్శి యుగంధర్, క్లర్క్ అమానుల్లా పాల్గొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు రండి..

మంత్రికి, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యేలకు ఆహ్వానం

విశాలాంధ్ర- ఐరాల: స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం లో సెప్టెంబర్ 18వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డిని, టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ని, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ను కాణిపాకం దేవ స్థానం చైర్మన్ ఏ .మోహన్ రెడ్డి, వెంకటేశు కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

గుడుపల్లె ఎంపిడిఓ ఎస్ తాజ్ మస్రూర్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కుప్పం : గుడుపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా యస్.తాజ్ మస్రూర్ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. గతంలో యస్.తాజ్ మస్రూర్ గంగవరం ఎంపీడీవో గా బాధ్యతలను నిర్వహిస్తూ బదిలీపై గుడుపల్లె ఎంపీడీవో గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుపల్లె మండల ప్రజలకు ఎల్లపుడూ ప్రభుత్వ పరమైన సేవలు అందించ డానికి సిద్ధంగా ఉన్నానన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి యస్.తాజ్ మస్రూర్ కి ఎంపీపీ వరలక్ష్మి గోపి, జెడ్పీటీసీ కృష్ణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య అధికారి జానకిరావు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యకారి మాట్లాడుతూ పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. విద్యార్థినులకు హనీమియా హెచ్‌బి పరీక్షలు నిర్వహించి తగు ఆరోగ్య సూచనలు చేశారు. విద్యార్థినిలు ఆకుకూరలు ,చిరుధాన్యాలు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, వైద్య సిబ్బంది శారద, ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి కి సన్మానం

విశాలాంధ్ర- పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ మిట్ట మీద రాచపల్లెలో బుధవారం వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమితులైన మూగ హేమ సుందర్ రెడ్డి ని సర్పంచ్ కోటకొండ ఉష రాణి నరసింహులు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ మురవత్ భాష, వైసిపి నాయకులుపురుషోత్తం రెడ్డి, శివారెడ్డి, బసవరాజ,కోదండయ్య ,జనార్ధన, రెడ్డి ప్రసాద్, గిరి కుమార్ రెడ్డి, జేడీ నారాయణ, అరుణ్ కుమార్ రెడ్డి ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భూ రిజిస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖరుల నిరసన

విశాలాంధ్ర - పుంగనూరు: భూ రిజిస్టర్ నూతన విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పరిధిలోని దస్తావేజు లేఖరుల యూనియన్ సభ్యులు బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సబ్ రిజిస్ట్రారుకు వినతి పత్రం ఇచ్చి, నూతన విధానం రద్దు చేయాలని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డికి లేఖ రాశామని ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి, జగదీష్ కుమార్ అన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్డుప్రైమ్ 2.0 విధానాన్ని తీసుకుని రావడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దస్తా వేజు లేఖరులు జీవనం లేక రోడ్డున పడతా రన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం వల్ల ప్రజల ఆస్తికి రక్షణ లేకుండా పోతుందన్నారు. అనేక మంది ప్రజలు ఆస్తులపై కోర్టులకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. 'ఎన్నో ఏళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎదుట దస్తావేజులు రాసుకుని అనేకమంది బతుకుతున్నారని, అలాంటి వారి కడుపు కొట్టడం ప్రభుత్వానికి తగునా?' అంటూ విమర్శించారు తాము చేస్తున్న నిరసన గళానికి ప్రజలు సైతం తరలివచ్చి మద్దతు తెలపాలని కోరుతున్నా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరితో నూతన విధానంతో ముందుకు వెళితే రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖరుల యూనియన్ సభ్యులు సోమల బాబు, పవన్ కుమార్, రవీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

విశాలాంధ్ర - సోమల: సోమల మండలం లోని కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డా. విజయలక్ష్మి, డా.నీలిమ ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లా డుతూ అంటు వ్యాధులు రాకుండా పిల్లలు తమ తమ చేతులు ను పరిశుభ్రంగా ఉంచుకొని ఆహారం తీసుకోవాలని తెలిపారు. పలు ఆరోగ్య సమస్యలు పై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. వెంకట రమణ రెడ్డి, కృష్ణ రెడ్డి, వైద్య సిబ్బంది కుమార్, వెంకటేశ్వర్లు ఏ.ఎన్ ఎం లు, ఎం.ఎల్.ఎచ్ ఓ లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు ద్వారా వేరుశనగ అధిక దిగుబడి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: సస్యరక్షణ పద్ధతుల ద్వారా వేరుశనగ పంట లో అధిక దిగుబడులు సాధించ వచ్చని రాస్ కెవికె ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసు లు అన్నారు. బుధవారం మండలం లోని కొమరగుంట, ఇనాంకొత్తూరు లలో ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో హైడ్రోజెల్ వినియోగం పై రాస్ కెవికె వారి ఆత్మా, చిత్తూరు జిల్లా వారి సహకారంతో హైడ్రోజెల్ వినియోగం పై వేరుశనగ రైతులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిం చామన్నారు. ఈ క్రమంలో వేరుశనగ పంటను దాదాపు 350 హెక్టారులలో ఖరీఫ్ సీజన్లో వర్షాధారంగా పండిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట సున్నితపు కాలంలో ఎక్కువగా బెట్ట పరిస్థితితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు వేరుశనగ దిగుబడి 35 శాతం తగ్గి పోయే అవకాశాలు ఉన్నాయని,నీటి తడులు ఇవ్వడానికి అవకాశం లేని రైతులు హైడ్రో జెల్ ను వేసుకొంటే పంట కాలంలో పడిన వర్షాన్ని బాగా వినియోగించుకొని సాధారణ దిగుబడులు పొందే అవకాశం ఉందని తెలిపారు. రత్న ప్రసాద్, ఆత్మా కోఆర్డినేటర్ మాట్లాడుతూ హైడ్రోజెల్ వేసుకోవడం వల్ల నెల స్వభావం, గుణ గణాలు పంటకు అనుకూలంగా ఉంటాయని, వర్షపు నీటిని పంటకు సంపృదిగా వినియోగ పడేలా ఈ హైడ్రోజెల్ చేస్తాయని, దీని వినియోగం వలన ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని రైతులకు సూచించారు. డా. దివ్య శాస్త్రవేత్త రాస్ కేవిక్ మాట్లాడుతూ వేరుశనగ పంటలో హైడ్రోజెల్ ఎకరాకు 5 కిలోలు వేసుకొని మట్టిలో కలిసేలా కలుపుకోవాలన్నారు. ఈ హైడ్రోజెల్ ల ఉపయోగం మట్టిలో ఒక సంవత్సర కాలం పాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన శాఖ సహాయ అధికారి చెంగమ్మ, రైతులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంను తిరుపతి జిల్లాలో కలపాలి: టీడీపీ

విశాలాంధ్ర-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని టిడిపి నాయకులు మండల కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారుకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి మోహన్ మురళీ మాట్లాడుతూ జీడి నెల్లూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి తుడా పరిధిలో ఉన్న వెదురుకుప్పం మండలాన్ని తిరుపతిలో కలిపేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తన రాజకీయ స్వార్థం కోసం కర్వేటినగరం, వెదురుకుప్పం మండలాల అభివృద్ధిని తాకట్టు పెట్టారన్నారు.ఈ క్రమంలో నియోజకవర్గ మీడియా కో ఆర్డినేటర్ కిషన్ చంద్ మాట్లాడుతూ.. పక్క నియోజకవర్గాల లో నగరి,పుంగనూరు లలో ప్రాతి నిధ్యం వహిస్తున్న రోజా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లు వారి పరిధిలోని మండలాలను తిరుపతి జిల్లా లో కలిపారని అన్నారు.డిప్యూటీ సిఎం చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఐరాల : ఐరాల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాణిపాకం నందు సి ఆర్ సి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ ట్రైనింగ్ సెంటర్‌లో ఐరాల, పూతలపట్టు, తవణంపల్లి మండలాల నుంచి తెలుగు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా బై జ్యూస్ నోడల్ అధికారులు వి .సుధాకర్, సి .మోహన్ సింగ్ హాజరై బై జ్యూస్ టాబ్స్ పనిచేయని వాటిని తెప్పించి, పనిచేసే విధంగా అందరి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మూడు మండలాల ప్రధానోపాధ్యాయులకు పని చేయని టాబ్స్ ను యాక్టివేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే గవర్నమెంట్ హై స్కూల్ ఐరాల నందు మండల సి. ఆర్.సి పరిధిలోని ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం ఈ ఓ 1 రుశేంద్రబాబు, ఎం ఈ ఓ 2 దామోదర్ నాయుడు హాజరై ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ లుగా ఉపాధ్యాయులు యుగంధర్ రెడ్డి, ఏకాంబరం పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాణిపాకం ప్రధానోపా ధ్యాయులు చంద్రశేఖర్ నాయుడు, ఐరాల ప్రధానోపాధ్యాయురాలు కోమల, ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుకు చుక్కలే..

- మాపై తప్పుడు కేసులు పెట్టిన ఏ ఒక్కరినీ వదలం..కోర్టుకి ఈడుస్తాం
- జనసేన నాయకుల హెచ్చరిక

విశాలాంధ్ర - తిరుపతి : తప్పుడు కేసులకు భయపడం, వెనకడుగు వెయ్యమని అవసరమయితే సుప్రీం కోర్టు కి అయినా వెళతామని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి వినుత కోటా హెచ్చరించారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, చిందేపల్లి మార్గాన్ని ఈసీఐఎల్ కంపెనీ ఆక్రమించుకున్న కేసులో గ్రామస్తుల వైపు నిలబడ్డ తమపై తప్పుడు కేసులు పెట్టిన పాపానికి భారత అత్యున్నత న్యాయస్థానం వరకు తాము న్యాయ పోరాటం చేశామని చివరిగా సుప్రీంకోర్టు చివరి తీర్పుతో తన తండ్రి భాస్కర్ బాబు గారికి ఊరట లభించిందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ వినుత కోటా, భర్త కోట చంద్రబాబు ఆమె తల్లిదండ్రులతో కలసి తిరుపతి ప్రెస్ క్లబ్ లో మీడియాతో సమావేశం లో తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కేవలం రాజకీయ కక్షలతోనే జనసేన పార్టీలో తాము కొనసాగుతున్నామని తమతో పాటు కుటుంబ సభ్యులపై పోలీస్ అధికారులను ఉపయోగించి తప్పుడు కేసులు పెట్టి సునకానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి తమ క్లినిక్ లో పనిచేసే మహిళలను సైతం 2,3 రోజులు పోలీస్ స్టేషన్లో ఉంచారని ఆరోపించారు. తమపై తప్పుడు కేసులు పెట్టిన ప్రతి ఒక్క పోలీస్ అధికారి పైన రిటర్న్ కేసులు వేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే పథకం ప్రకారం దగ్గర కంప్లైంట్ ఇప్పించి అందులో 307, సెక్షన్లు వచ్చేట్లు తప్పుడు ఆరోపణలు పెట్టి ముందస్తు బెయిలు రానివ్వకుండా హై కోర్ట్ లో పి.పి.ఈ ద్వారా అడ్డుకు న్నారని 3 సార్లు హై కోర్టు నందు వారి తండ్రికి బెయిలు కు అడ్డుపడ్డారని. చివరకి సుప్రీం కోర్టులో 34124/2023 ఆర్డర్ ద్వారా బెయిలు మంజూరు అయ్యిందని తెలిపారు. ఒక పక్క తన భర్త కోటా చంద్రబాబు గారిని అక్రమంగా విజయవాడ నుండి ముందస్తు పథకం తో అరెస్టు చేసి 14 రోజులు జైలులో పెట్టారు, తన తల్లదండ్రుల్ని సైతం కేసులు పెట్టి 5 నెలలు ఊరిలో లేకుండ చేసి ఆరోగ్య పరంగా, మానసికంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. రానున్నది జనసేన ప్రభుత్వం అని తమను ఇబ్బంది పెట్టిన

దుర్మార్గులను ఎవరిని విడిచి పెట్టేది లేదన్నారు. తన తండ్రి భాస్కర్ గారు ఎమ్మెల్యే ను ఉద్దేశించి మాట్లాడుతూ నీ లాంటి చిల్లర రాజకీయ నాయకులను నా అనుభవంలో చాలా మందిని చూశానని, పవన్ కళ్యాణ్ గెలుపు కోసం ఇంకా బలంగా పనిచేసి నీ ఓటమిలో నా సత్తా ఎంటో చూపిస్తామని హెచ్చరించారు.ఈ కేసు విషయంలో అన్ని విధాలా అండగా ఉన్న పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి, ఎప్పటికప్పుడు సుప్రీం కోర్టు వరకు పర్యవేక్షించిన చైర్మన్ నాదెండ్ల మనోహర్ కి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు.

కలెక్టర్‌కు రేణిగుంట విమానాశ్రయ అధికారుల కృతజ్ఞతలు

విశాలాంధ్ర - తిరుపతి : రేణిగుంట విమానాశ్రయానికి సంబంధించి చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్న 3.40 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం ఎయిర్‌పోర్టు అథారిటీకి తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయ విస్తరణకు అప్పగించిన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయ అధికారులు ఎయిరుపోర్టు డైరెక్టర్ బసవరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్, డిజిఎం ఎయిరుపోర్టు వెంకటరమణ సంయుక్తంగా కలెక్టర్ కె వెంకట రమణా రెడ్డి, జెసి డీకే బాలాజీ ని బుధవారం కలిసి వారి సేవలను, కృషిని అభినందిస్తూ పుష్ప గుచ్చాలు అందచేసి కృతజ్ఞతలు తెలిపారు.

కరెంటు స్తంభాలను ధ్వంసం చేసిన టిప్పర్

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం గ్రామంలో టిప్పర్ కు చెందిన వెనుక భాగంలో ఉండే అన్‌లోడ్ బాడీ కిందకు దించకుండా నడుపుకుంటూ డ్రైవర్ వెళ్లాడు. టిప్పరుకు వెనుక భాగంలో ఉండే లోడ్ బాడీ కరెంటు తీగలకు తగిలిన విషయాన్ని గమనించని డ్రైవర్ ముందుకు వెళుతుండడంతో ఏకంగా 10 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మతులు ప్రారంభించారు. ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ఆలయాల కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : ధర్మపరిషత్-ధర్మ ప్రచార మాసోత్స వాల్లో భాగంగా చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ కాళహస్తీ శ్వర స్వామి, జ్ఞానప్రసు నాంబ అమ్మవార్లుకు అభిషేకం నిర్వహించి అనంతరం కళ్యాణ మహోవత్సవం శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వేదపం డితులచే చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థాన, చైర్మన్, దువ్వూ రు బాలచంద్రా రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి సమక్షములో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో ధర్మకర్తల మండలి సభ్యులు ముప్పాళ చంద్రశేఖర్ రెడ్డి , మన్నెముద్దు పద్మజ, బండి సునీత, కర్లపూడి సురేష్ బాబు, ఓలేటి బాల సత్యనారాయణ, పెనుబెటి మారెమ్మ, మున్సిపల్ చైర్మన్, దబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

లోకేష్ యువగళం పాదయాత్ర జయప్రదం కావాలి: టీడీపీ

విశాలాంధ్ర - చంద్రగిరి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర నిర్విఘ్నం గా జయప్రదం కావాలని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్ చార్జి పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) కోరారు. నారా లోకేష్ చేపట్టిన యువగలం పాదయాత్ర "200" రోజులు కు చేరుకున్న సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు రామచంద్రాపురం మండలం రాయల్ చెరువు కట్ట కింద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించుకుని అక్కడి నుండి రామచంద్రాపురం సర్కిల్ వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ ఆరు మండలాల తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువత కుటుంబ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన ఓ ప్రకటనలో కోరారు. సంఘీభావ ర్యాలీ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కు చంద్రగిరి టౌన్‌ని యం.యస్. ఆర్ కళ్యాణ మండపం నందు చంద్రగిరి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని ఆరు మండలాల నాయకులు, యువత, కార్యకర్తలు, మహిళలు, క్లస్టర్ ఇంఛార్జి లు, యూనిట్ ఇంఛార్జి లు, బూత్ ఇంఛార్జి లు తప్ప హాజరు కావాలని కోరారు.

ప్లాస్టిక్ పై ఉక్కుపాదం

- మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తిరుపతి నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. తిరుపతి నగరం లో బుధవారం ప్లాస్టిక్ విక్రయాలపై కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన మేరకు 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, వినియోగించడం చట్ట విరుద్ధమన్నారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు, ఫోర్క్ లు, స్ట్రాలు, థర్మాకోల్ ప్లేట్స్, కంటైనర్స్, అర్థలీటర్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళు, పాలిప్రోపలిన్ క్యారీ బ్యాగ్స్, వాటర్ ప్యాకెట్స్ వంటివి విక్రయిస్తూ పట్టుబడితే రూ.5 వేలు నుంచి రూ.25 వేలు వరకు లభ్యతను బట్టి జరిమానా విధిస్తామన్నారు. అలాంటి దుకాణాలను సీజ్ చేస్తామని, మరొకసారి పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు దుకాణదారులకు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, శానిటరీ మేస్త్రి లు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బియ్యపు మధుకు రాఖీ కట్టిన మహిళలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూద నరెడ్డికి బుధవారం రక్షాబంధన్ పురస్క రించుకుని పలువురు మహిళలు రాఖీ కట్టి శుభా కాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైసీ పీ కార్యాలయంలో ఈ రాఖీ వేడుకలు నిర్వహించారు. రాఖీ కట్టిన మహిళలకు బియ్యపు మధుసూదనరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తు న్నారన్నారు. ఒక అన్నగా, తమ్ముడిగా మహిళలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో డీఈఓ సమావేశం

విశాలాంధ్ర - వరదయ్య పాలెం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరదయ్యపాలెం ఉపాధ్యాయులతో సమావేశ మైన డిఈఓ శేఖర్ ఈ మధ్యకాలంలో ఆ పాఠశాలకు చెందిన అంకురెడ్డి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అస భ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులు రావడంతో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఏ విధంగా ఉండాలో, ప్రవర్తించాలో, విద్యా బోధనలు చేయాలో, ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నిష్పక్షపాత పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా పనిచేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర - తిరుపతి : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2024 ఇంటింటి సర్వే కార్యక్రమం పూర్తిచేశామని, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కొనసాగుతోందని సెప్టెంబర్ 29 నాటికి పూర్తి అవుతుందని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో ఎస్.ఎస్.ఆర్ -2024 పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏడవ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారు లక్ష్యంగా అందరూ సహకరించాలని, క్లైమ్స్ మొత్తం 1,78,988 అందాయని తొలగింపుల విషయంలో నోటీసులు ఇచ్చి నిర్ధారణ అనంతరం రికార్డు ఫైల్ చేసి అనంతరం ఇఆర్ఓ తొలగింపులు చేపట్టనున్నారన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత ఎస్ ఎస్ ఆర్ నుండి నేటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాలో నియోజక వర్గంలో 100 శాతం వెరిఫికేషన్ దిశగా బిఎల్ఓ లు చేపట్టారని, ఈఆర్ఓలు, ఏఈఆర్వో లు 1000, స్పెషల్ ఆఫీసర్లు 500, జిల్లా ఎన్నికల అధికారి గా తాను నియోజకవర్గానికి 100 గృహా లను సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధిలో ర్యాండంగా పరిశీలన చేపట్టామని, ఇందులో ఫిర్యాదులు అందిన వాటిపై తప్పనిసరి పరిశీలన ఉంటుందని, ప్రతి బి.ఎల్.ఓ. రిజిస్టర్ నిర్వహించాలని పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, సహకరించాలని సూచించారు. క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పై పూర్తి బాధ్యత ఏ ఈ ఆర్వో లదే అని గుర్తించి జాగ్రత్తగా పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతివారం రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారని ఆ మేరకు ఎస్ ఎస్ ఆర్ -2024 షెడ్యుల్ పూర్తి అయ్యేవరకు సమావేశాల నిర్వహణ ఉంటుందని , పారదర్శక ఓటర్ల జాబితా తయారే లక్ష్యం అన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ రానున్న సెప్టెంబర్ 29వరకు ఉంటు ందని 2 కిలోమీటర్ల పరిధి , 1400 ఓటర్ల కన్నా ఎక్కువ వుంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు వంటి ప్రక్రియ జరగనుందని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరిన సమాచారాన్ని ఎఇఆర్ ఓ లు అందించేలా వుండాలని అన్నారు. ప్రతి ఫిర్యాదు సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నామన్నారు. ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురితం అయ్యే నాటికి సున్నా ఓటర్లు, ఒకే ఇంటి నంబర్ పై పదిమందికి పైన ఓటర్ లాంటివి ఉండకూడదని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ముసాయిదా ఓటర్ జాబితా తయారవ్వాలి అని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై కలెక్టర్ వివరిస్తూ ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు, వారి రిప్రజెంటేషన్ లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమీక్షలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ రవి , వైసీపీ నుంచి చంద్రమౌళి రెడ్డి, టీడీపీ నుంచి సుధా రెడ్డి, మనోహరాచారి, ఇ ఆర్ఓ లు కిరణ్ కుమార్, కనక నరసారెడ్డి, శ్రీనివాసులు, ఏ ఈ ఆర్ ఓ లు శిరీషా, వెంకటరమణ, ఎన్నికల తహశీల్దార్ సురేష్ , డి.టి లు కిరణ్మయి, జీవన్ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

విశాలాంధ్ర - తిరుమల : ప్రతినెలా జరిగే డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం సెప్టెంబరు ఒకటో తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి కి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు 0877-2263261 కు సంప్రదించవచ్చును.

ప్రభుత్వ ఉద్యోగి భౌతిక కాయానికి నివాళి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్ర గిరి మండలం ఎం.కొంగర వారిపల్లి గ్రామానికి చెందిన ప్రభు త్వ ఉద్యోగి చలిచీమల మోహన్ నాయుడు మృతి చెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మోహన్ నాయుడు కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ బాషా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణ దేవాలయ కుంబాభిషేకం

విశాలాంధ్ర-చంద్రగిరి: సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్ణీత వ్యవధి కంటే ముందే ఆలయ నిర్మాణం జరిగిం దని ఏక వీరా సేవా ఫౌండేషన్ వ్యవ స్థాపకులు ప్రతాప్ స్వామీజీ తెలిపారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా సనాతన హైందవ ధర్మ వ్యాప్తి, మత మార్పిడులను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ,మత్స్యకారుల గ్రామాల్లో ఆలయాలు నిర్మించేందుకు సమరత సేవా ఫౌండేషన్ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా చంద్రగిరి మండలం, పాత శానంబట్ల హరిజన వాడ లో నిర్మించిన శ్రీకృష్ణ భజన మందిర కుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో (జనరల్) గుణ భూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యపై కళాజాతా

విశాలాంధ్ర- నారాయణవనం: నారాయణవనం మండలం మేజర్ పంచా యతీలో పిఏసి యమ్ కార్యా లయంలో చిత్తూరు జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యం లో ఆర్థిక అక్షరా సత్య, డిజిటల్ లావాదేవీలపై సత్య కృష్ణ బృందం ఆధ్వర్యంలో బుధవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్‌పర్సన్ టి.ఊరప్ప మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరం డిజిటల్ నగదు రజిత లావాదేవులు, సైబర్ క్రైమ్ పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సహకార బ్యాంకు ద్వారా వ్యవసాయ బంగారు ఆభరణాలు గృహ వ్యాపార రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ విజయ్ భాస్కర్ రెడ్డి , సూపరువైజర్ సుధీర్ కుమార్ పిఏసిఎస్. డైరెక్టర్లు, సిఇఒ. సారధి, పాల్గొన్నారు.

నవరత్నాల అవినీతిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్

విశాలాంధ్ర- సత్యవేడు: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకంలో రూ. లక్ష 35 వేల కోట్లు అవినీతి జరిగిందని మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. బుధవారం సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాలు పథకంలో రెండున్నర లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ లెక్కన చూస్తే 26 జిల్లాల్లో ప్రతి పంచాయతీ కీ రూ.10 కోట్ల వంతున అభివృద్ధి జరిగి ఉండాలని, కానీ గ్రామాల్లో ఏ ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని ఈ నిధులన్ని ఏమైపోయా యంటూ ఆయన ప్రశ్నించారు.ఈ అవినీతిని నిగ్గు తేల్చకుండా కాగ్ మత్తులో పడిపోయి ఉందని విమర్శించారు. నవరత్నాల నిధులపై కేంద్రం సిబిఐతో ఎంక్వైరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మరోవైపు ప్రముఖ పుణ్యక్షేత్రం టీటీడీలో కూడా రూ. 17వేల కోట్లుకు లెక్కలు లేకుండా మాయం చేశారని ఆరోపించారు. టిటిడికి సంబంధించిన బంగారం నిల్వలు, నిధులపై రాష్ట్ర ప్రభుత్వం అప్పు ఏమైనా తీసుకుందా? అన్న అనుమానం వ్యక్తం చేశారు.అటు నవరత్నాల పథకం నిధులు,ఇటు టిటిడి నిధుల పైన రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. సత్యవేడు నియోజక వర్గంలో అవినీతి తారా స్థాయికి చేరిందని విమర్శించారు. వేల టన్నుల కొద్ది ఇసుకను అక్రమం గా తరలించేశారని, ఇసుక రవాణాకు సంబంధించి స్థానిక నాయకులకు కమిషన్ల రూపంలో రోజుకు రూ. 10 లక్షల అందుతున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి

- న్యాయవాది రాజేశ్వరరావు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : టిఎంవి కండ్రిగ గ్రామ సచివాలయ పరిధిలో న్యాయపరమైన సమస్యలున్నా తెల్లకాగితంపై జడ్జికి అర్జీ ఇచ్చినచో తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని మోడల్ విలేజ్ టిఎంవి కండ్రిగ గ్రామ ప్రజలతో న్యాయవాది రాజేశ్వర రావు తెలిపారు. మోడల్ విలేజ్ లో భాగంగా టిఎంవి కండ్రిగ గ్రామాన్ని న్యాయవాది బుధవారం సందర్శించారు. హైకోర్టు, శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జ్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగ గ్రామంలో గ్రామ సచివాలయ కార్యా లయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయ వాది రాజేశ్వరరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు ముందే టిఎమ్ వి కండ్రిగ గ్రామము మోడల్ విలేజ్ గా ఎన్నుకున్నారని తెలిపారు. అప్పటినుంచి ఈ ఊరిలో ఏ సమస్యలు లేకుండా ఉందని గుర్తించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలో న్యాయపరమైన సమస్యలున్నా తెల్లకాగితంపై జడ్జి కి అర్జీ ఇచ్చినచో తక్షణమే పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. మరిన్ని న్యాయ సలహాలకు 15100 ను సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి లో జరుగుతున్న పంచమవేదం మహాభారతంలో బుధవారం దుర్యోధన వధ ఘట్టం ఆకట్టు కుంది. పాత తరం నాయకులకు భిన్నంగా యువకులు నడుం బిగించి మహాభారత మహోత్స వాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వ హించారు. ఈ సందర్భంగా చంద్రగిరి లో ద్రౌపదీ సమేత ధర్మ రాజుల ఆలయాన్ని తుడా చైర్మన్ చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దర్శించుకున్నారు. మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం కీలక ఘట్టమైన దుర్యోధన వధను తిలకించారు. దుర్యోధన వేషంలో ఉన్న వ్యక్తితో మోహిత్ రెడ్డి భీమునిగా గధ పట్టుకుని చేసిన పోరాట విన్యాసం ఆకట్టు కుంది. పగటి పూట జరిగే మహాభారత ఘట్టాలలో చివరిది. అత్యంత ప్రజాదరణ కలిగినది దుర్యోధన వధగా నిర్వహకులు పేర్కొన్నారు. ఈ ఘట్టం ప్రజలను ఎంతగానో అలరించింది. అంతకుముందు సారెతో ఆలయం వరకు ర్యాలీగా వెళ్లిన మోహిత్ రెడ్డికి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మోహిత్ రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దుర్యో ధ న వధ ఘట్టం లో మోహిత్ రెడ్డి పాల్గొన్నారు. హిందూ సంస్కృతి సృష్టికి ముఖ్యమైన అంశాలలో మహాభారతం ఒకటి అని మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. కానీ మహాభారతం చదవ దానికి ప్రధాన కారణం చారిత్రక ప్రాముఖ్యత కాదన్నారు. విస్మయాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించే శక్తివంతమైన, అద్భుతమైన వచనంగా అభివర్ణించారు. దుర్యోధనుని వధ ఘట్టంలో ఆయన రక్తంతో (కుంకుమతో) తడిసిన ఆ మట్టిని ప్రజలు పోటీ పడి తీసుకెళతారు. ఆ మట్టిని తమ గాదెలలో వేస్తే తమ గాదె ఎన్నటికి తరగదని ప్రజల విశ్వాసం. అలాగే ఆ మట్టిని తమ పొలాల్లో చల్లితే తమ పంటలు సంవృద్ధిగా పండతాయని ప్రజల నమ్మకం.ఈ కార్యక్రమంలో ధర్మకర్త విరూపాక్షి శంకర్ రెడ్డి, కోటేశ్వర రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, సుధాకర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

ఓటర్ జాబితా తనిఖీ

విశాలాంధ్ర - సత్యవేడు : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తేదీ 06.01.2022 నుండి 31.03.2023 వరకు ఓటర్ల జాబితా లో జరిగిన తొలగింపులను క్షేత్ర స్థాయిలో వెరిఫై చేయాలని ఇచ్చిన సూచనల మేరకు సత్యవేడు నియోజకవర్గం లోని పలు పోలింగ్ బూత్ ల పరిధిలో తొలగించిన ఓటర్ల జాబితాను క్షేత్ర స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి, ఈఆర్ఓ శ్రీనివాసులు, నియోజక వర్గ ఓటర్ డిలీషన్ జాబితా పరిశీలన ప్రత్యేక అధికారి భాస్కర్ రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. బుధవారం ఉదయం సత్యవేడు నియోజక వర్గంలో పలు పోలింగ్ బూత్ ల పరిధిలోని గృహాలను కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి ఓటర్ జాబితా నుండి తొలగించిన వారి వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెరిఫై చేశారు. ఈ సందర్భంగా నాగలాపురం, పిచ్చాటురు, నారాయణవనం మండలాల పరిధిలో పోలింగ్ బూత్ లలో డబుల్ ఎంట్రీ అయిన, చనిపోయిన, మరొక ప్రాంతానికి తరలి పోయిన, వలస పోయిన తదితర కారణాల వలన తొలగించబడిన ఓటర్ల జాబితాను క్షేత్ర స్థాయిలో ర్యాండమ్ గా కలెక్టర్ పరిశీలించి వెరిఫై చేశారు. భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల ఫైళ్ళను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఈఆర్ఓ, తహశీల్దార్, సంబంధిత బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు తహశీల్దారు మధుసూదన్, నాగలాపురం తహశీల్దారు ప్రసన్నకుమార్, నారాయణ వనం తహశీల్దారు ప్రమీల, సూపరువైజర్లు , బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎలాంటి పొరబాట్లు లేకుండా ఓటర్ల జాబితా

- ఓటరు నమోదు అధికారి హరిత

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి నగరం ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా బహిరంగంగా సిద్ధం చేస్తున్నామని తిరుపతి ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి నియోజక ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ ఛాంబర్ లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లా డుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని, తిరుపతి నియోజకవర్గ పరిధిలో 265 పోలింగ్ కేంద్రాలకు 265 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించామన్నారు. వీరు వీరి పరిధిలోని ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి రిపోర్ట్ సిద్ధం చేసారని తెలిపారు. 18 యేళ్ల నిండి వుండి ఓటు నమోదు చేసుకోని వారి వద్ద ఫార్మ్ 6 తీసుకుని చేర్పిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల వారికి ఏమైనా అనుమానాలు ఉన్నా తమ బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి, బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలసి నివృత్తి చేసుకోవాలన్నారు. మీకు సరైన సమాధానం దొరకని పక్షంలో నేరుగా పై అధికారు లను కలసి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎలక్షన్ డోర్ నంబర్లు ప్రతి ఇంటి వద్ద వేయించినట్లు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద కొత్త, పాత డోర్ నంబర్లను పెయింటింగ్ చేయించి నందుకు సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా సిద్ధం చేస్తున్నట్లు తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళి శ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ, డి.టి.జీవన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెంగల్ రాయులుకి ఘన నివాళి



విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి సీపీఐ ఆఫీస్ సెక్రటరీగా, గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి మెమోరియల్ సొసైటీ భవనానికి వాచ్‌మెన్‌గా సుమారు 12 సంవత్సరాలుగా నిబద్ధతతో పని చేశారని చెంగల్ రాయులు అకాల మరణం బాధాకరమని వారికి సంతాపం తెలుపుతున్నామని, వారి కుటుంబానికి సీపీఐ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు జిల్లా సీపీఐ బృందంతో కలిసి వారి స్వగ్రామం రాయల్ చెరువులో ఉంచిన భౌతికాయానికి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జె.విశ్వనాథ్, బి. నదియా, నాయకులు ఎన్. శివ, కె.వై.రాజా, చిన్నం కాలయ్య, ఆర్ బలరాం, కే రామకృష్ణ, కె.రామ్మూర్తి, కే రామకృష్ణారెడ్డి, ప్రమీల, అఖిల పాల్గొన్నారు.

నిందితులను అదుపులోకి తీసుకోవడంలో నిర్లక్ష్యం

శ్రీసిటీ పోలీసుల తీరుపై మృతుడు భార్య అసహనం

విశాలాంధ్ర- సత్యవేడు:తన భర్తను చంపిన నిందితులను అదుపులోకి తీసుకోవడంలో శ్రీసిటీ పోలీసులు నిర్లక్ష్యం చూపుతు న్నారని మండల పరిధిలోని పెద్ద ఈటిపాకం పంచాయతీ రాచపాలెం దళితవాడకు చెందిన మృతుడు మన్నార్ కుమార్ భార్య గౌరీ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం సత్యవేడు ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో తన భర్తను కొట్టి చంపిన ఘటనను ఆమె వెల్లడించారు. 2023 ఫిబ్రవరి 27వ తేదీన స్థానిక కోమాక్షమ్మ ఆలయ సమీపంలో మెడపై తీవ్ర గాయాలతో పడి ఉండడాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం అందిందన్నారు. ఈ నేపథ్యంలో స్పృహ కోల్పోయి పడి ఉన్న కుమార్ను చికిత్స కోసం తొలత తిరుపతికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స కోసం చెన్నై ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు.అయితే అక్కడ కుమార్ చికిత్స పొందుతూ మార్చి 4న మృతి తన భర్త మృతిచెందినట్టు పేర్కొన్నారు. వృత్తి రీత్యా డ్రైవర్ కావడం, తాగుడు అలవాటు ఉన్న తన భర్త ప్రమాదవశత్తు మృతి చెంది ఉంటాడని తొలత కుటుంబ సభ్యులు భావించామన్నారు.అయితే ఈ సంఘటన జరిగిన 20 రోజుల తర్వాత మార్చి 26న అదే గ్రామానికి చెందిన సదాశివం అనే వ్యక్తి కుమార్ ప్రమాదంలో మరణించ లేదని,బాలాజీ అనే వ్యక్తి కత్తితో మెడపై నరకడంతో ఎముకలు విరిగిపోయి అక్కడే కదలలేని పరిస్థితిలో పడిపోయాడని చెప్పడంతో అసలు విషయం బయటపడిందన్నారు. దీంతో తాను శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో తన భర్తని ఆరుగురు కలిసి హత్య చేశారని ఫిర్యాదు చేసినట్లు వివరించారు.కానీ కొట్టి చంపడం వల్లే చనిపోయాడని నిందితులను ఫిర్యాదును పేర్కొన్న శ్రీసిటీ పోలీసులు మాత్రం ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని వాపోయారు.కేసు నమోదు చేసి నాలుగు నెలలు పూర్తవుతున్న నిందితులను అరెస్ట్ చేయకుండా కేసును నీరు కార్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిందితులను అరెస్టు చేయాలని పలుమార్లు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కుతుంటే నిందితులకు వత్తాసు పలికేటట్టు శ్రీసిటీ పోలీసుల వ్యవహార శైలి మారింది అన్నారు.పైగా పైసలు ఇప్పిస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నారని ఆరోపించారు.నిందితులను అరెస్టు చేయాలంటూ ఇటీవల శ్రీసిటీ పోలీస్ స్టేషన్ వద్ద వామపక్ష నాయకులు,ప్రజాసంఘాల నాయకులతో కలిసి ధర్నా కూడా నిర్వహించినట్లు ఆమె చెప్పారు.నగరిలో జరిగిన సీఎం పర్యటనలో ఈ విషయంపై ఫిర్యాదు చేద్దామని బయలుదేరుతుండగా శ్రీసిటీ పోలీసులు వచ్చి వెళ్లొద్దంటు నిందితులను అరెస్టు చేస్తామని చెప్పి ఇంతవరకు అరెస్టు చేయలేద న్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు దీనిపై స్పందించి తన భర్తను చంపిన నిందితులను అరెస్టు చేయడానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఆదిలక్ష్మి,అర్చన,హారిక, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి, మురళి, భావన నిర్మాణ నాయకులు తిరుమల గ్రామస్తులు ఆదిశేష రావు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం..ఫలసరకుల పంపిణీ

విశాలాంధ్ర-చిల్లకూరు : చిల్లకూరు డానియల్ అనాథాశ్రమంలో బుధవారం మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామ విఆర్‌ఏ రమేష్ కుమారుడు చింటూ కు గుర్తుగా ప్రథమ వర్థంతి సందర్భంగా, పిల్లలకు కేకు , మిఠాయిలు పంచిపెట్టారు. నెల రోజులకు సరిపడా ఫలసరుకులను వార్డెన్ బిజేంద్ర కుమార్ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో తాత య్య బాలయ్య, నానమ్మ స్వర్ణకుమారి , కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

క్రీడా యోగ పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతిలో అన్నారావు సర్కిల్ వద్ద గల ఆర్కే అబాకస్ విద్యా సంస్థ అధినేత రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా "క్రీడా యోగ పుస్తకం" ఆవిష్కరణ జరిగింది. ఈ పుస్తక ఆవిష్కరణ కర్తలు, ముఖ్య అతిథులు గా పాల్గొన్న సైకాలజిస్ట్ డాక్టర్ హరికృష్ణ పాకనాటి, తెలుగు ప్రాంత ప్రముఖ్ మారుతి మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రస్తుతం కాలంలో విద్యార్థులు టీవీలకు, మొబైల్ లకు బానిసలుగా మారుతున్నరని, దీనిని అధిగమించాలంటే ప్రపంచం లేదా దేశం గుర్తించిన క్రీడలనే కాకుండా, గ్రామీణ క్రీడలు పిల్లలనూ ఆకర్షించడంలో ముందుంటాయని తెలిపారు. ఇవి శారీరిక అభివృద్ధికి, మానసిక వికాసానికి ఉపయుక్తంగా ఉంటుంది అని వారు తెలిపారు. ఈ గ్రామీణ క్రీడలను యోగాతో అనుసంధానం చేస్తూ యోగా క్రీడలను దత్తారం పాల్ చేత వివేకానంద కేంద్ర కన్యాకుమారి ప్రత్యేక పుస్తకాన్ని తయారు చేయడం జరిగింది. దీనిని ప్రతి వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారా ప్రతి పాఠశాల యాజమాన్యం అనుసరించడం వల్ల పిల్లల్లో ఉన్న టీవీలు, మొబైలు పై ఉన్న రుగ్మతలను, బానిస తత్వాన్ని, మమకారాన్ని ముగింపు పలకవచ్చు అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, హరి నాయక్, హరిబాబు, నవీన్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో దొంగ ఓట్ల లోగుట్టు పై పక్క రాష్ట్ర అధికారిని నియమించాలి

టిడిపి నేత పులివర్తి నాని డిమాండ్

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్రవ్యాప్తంగా ఏ నియోజకవర్గంలో జరగనంత దొంగ ఓట్ల వ్యవహారం చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిందని తద్వారా వైసిపి గెలుపుకొనసాగుతోందని ఈ గూడుపుఠాణిని ఛేదించేందుకు పక్క రాష్ట్రాల నుండి నిజాయితీ కలిగిన అధికారిని ఏర్పాటు చేయాలని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌చార్జి పులివర్తి నాని డిమాండ్ చేశారు. మీడియా ముందు టిడిపి నాయకులతో కలిసి నాని మాట్లాడుతూ.వైసిపి గెలుపు నుండి చంద్రగిరి లో ప్రతిపక్ష పార్టీలకు.టిడిపి సానుభూతి పరులకు సంబంధించిన వారి ఓట్లను తొలగించారన్నారు. చనిపోయిన వారి ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి ఓట్లను అక్కడే ఉన్నట్లే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ దొంగ ఓట్ల రాజకీయం చంద్రగిరి నుంచి రాష్ట్రానికి అల్లుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి దొంగఓట్లతో గెలిచిన గెలుపు గెలుపేనా? అని ప్రశ్నించారు.ఈ దొంగ ఓట్ల లో అధికారుల పాత్ర ప్రధానమైనది అన్నారు.తెలుగుదేశం పార్టీగా తాము పోరాటాలు చేస్తుంటే అధికారులు భయపడి , ఓట్ల లిస్టును సరి చేయదానికి ప్రయత్ని స్తున్నారని , చంద్రగిరి వైసీపీ ప్రధాన సూత్రధారి అధికారులను మధ్యపెట్టి మీ వెనక నేనున్నానని దొంగ ఓట్లను తొలగించవద్దని ఆఫీసర్లకు ధైర్యాన్ని నూరి పోశారన్నారు. ఏది ఏమైనా దొంగ ఓట్ల లో ప్రధానంగా ఉన్న అధికారులను సస్పెండ్ చేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు ఇప్పటికైనా చంద్రగిరి పాలకులలో మార్పు రావాలని , లేకుంటే జైలు జీవితం తథ్యమని హెచ్చరించారు.

ఘనంగా రక్షబంధన్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : విజేత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రక్షాబంధనం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యా ర్థులందరూ చెల్లెలు అన్నలకి రాఖీ కట్టే సంప్రదాయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, ఎప్పుడూ చెల్లెలికి భద్రతగా ఉంటాననే ప్రమాణంతో ఈ రాఖీని కట్టించుకోవడం అనే సాంప్రదాయం తెలియజేసి రాఖీలు కట్టుకున్నారు. ఈ సంప్రదాయం విద్యార్థులు పాటించాలని, పాఠశాల డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్.ఉమా సింగ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.